పుంగనూరులో అధికార పార్టీ కనుసన్నల్లో.. పోలీసు రాజ్యం నడుస్తోంది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా.. సమస్యలపై నిలదీసినా 'కేసు'ల అస్త్రం బయటకు తీస్తున్నారు. విపక్షాలు రాజకీయ కార్యక్రమాలు చేపట్టాలన్నా అనుమతి ఇవ్వరు. కాదూ కూడదని నేతలు, శ్రేణులు బయటకు వస్తే కేసులే. ప్రత్యర్థి పార్టీల్లో చురుగ్గా వ్యవహరించే నేతలకూ కేసుల బెడద తప్పడంలేదు.

- పుంగనూరు

ఎస్టీ సెల్ అధ్యక్షుడిపైనా 9 కేసులు

మంత్రి పెద్దిరెడ్డి సొంత మండలమైన సదుంలో చురుగ్గా ఉన్న నియోజకవర్గ టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సుబ్బరాజుపై 9 కేసులు నమోదయ్యాయి. పలుమార్లు ఆయన్ను జైలుకూ పంపారు. వైసీపీ నాయకుల ప్రోద్బలంతో భూముల కేసులు, గలాటా కేసులు పెట్టడమే కాకుండా చివరకు తన భార్య, బిడ్డపైనా కేసులు పెట్టి వేధించారని ఆయన వాపోతున్నారు. చివరకు తనకుమార్తెను కిడ్నాప్ చేశారన్నారు. తాను టీడీపీలో ఉన్నాననే పోలీసులు అక్రమంగా కేసులు పెట్టారని ఆరోపించారు.





పుంగనూరులో పోలీస్ రాజ్యం!

- వైసీపీ ప్రత్యర్థులపై ఉక్కుపాదం
- మంత్రి పెద్దిరెడ్డిపై ఎదురుతిరిగితే కేసులే
- తాజాగా విపక్ష క్రియాశీల నేతలపై రౌడీషీట్ల అస్త్రం

పుంగనూరులో కేసులమీద కేసులు పెడుతూ వైసీపీ వ్యతిరేకులను పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. విపక్షాలు సభలు, ర్యాలీలు నిర్వహించాలన్నా సంబంధంలేని ప్రశ్నలు, ఆంక్షలతో చివరకు శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని అడ్డుకోవడం పరిపాటైంది. అధికార పార్టీ కార్యక్రమాలను మాత్రం దగ్గరుండి విజయవంతం చేయిస్తున్నారు. రాజకీయ కేసులు, అరెస్టుల విషయంలో రాష్ట్రంలోనే పుంగనూరులో అత్యధికంగా ఉన్నట్లు సమాచారం. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి రాజకీయంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా జిల్లాలోని పలువురు పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు చట్టాలు, నిబంధనల్లోని లొసుగుల ఆధారంగా ప్రత్యర్థులను ఇబ్బంది పెడుతున్నారన్న విమర్శలున్నాయి. వీటికి నిదర్శనాలూ ఉన్నాయి. గత నాలుగేళ్లలో పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలోని వందలాది మంది ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు, నాయకులపై వరుసగా కేసులు నమోదు చేశారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రత్యర్థి పార్టీల్లోని చురుకైన నాయకులు, కార్యకర్తలను కట్టడి చేసేందుకు ఒకవైపు కేసులు, మరోవైపు రౌడీషీట్ల అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. నేర చరిత్ర, శాంతి భద్రతలకు విఘాతం తదితర అంశాలను పట్టించుకోకుండా.. మూడు కేసులుంటే టీడీపీనేతలపై రౌడీషీట్లు తెరచి పోలీసులు విమర్శలు ఎదుర్కొంటున్నారు. 2020 మార్చిలో పుంగనూరులో మున్సిపల్, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో కొందరు అధికారులు, పోలీసుల సహకారంతో ప్రత్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం.. ఆ పత్రాలను చించేయడం లాంటి దౌర్జన్యాలకు వైసీపీ శ్రేణులు పాల్పడిన విషయాన్ని స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు. ఈ క్రమంలో పలువురు విపక్ష నేతలు పోలీసుల చర్యలపై న్యాయస్థానాలను ఆశ్రయించిన విషయం తెలిసిందే.

చౌడేపల్లె మండల టీడీపీ అధ్యక్షుడిపైనా 16 కేసులు



చౌడేపల్లె మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి అలియాస్ చిట్టిపైనా 16 కేసులు ఉన్నాయి. గతంలో ఈయనపై రౌడీషీట్ తెరవాలని పోలీసులు ప్రయత్నించగా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. మూడు కంటే ఎక్కువ కేసులున్నాయంటూ ఇటీవల ఆయనపై రౌడీషీట్ పెట్టారు.

ఎందరో నేతలు.. ఎన్నెన్నో కేసులు

- పుంగనూరులో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రాజు, తెలుగు యువత నేత నాగార్జున్‌పై 12 వంతున కేసులు నమోదు చేశారు. రొంపిచెర్లకు చెందిన నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సహదేవపై 11 కేసులు పెట్టారు.
- రొంపిచెర్ల మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ఎ.బాలాజీపై 9 చొప్పున.. సద్దాంపై 8 కేసులు నమోదయ్యాయి.
- సోమల మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, మాజీ సర్పంచి శ్రీనివాసులనాయుడు, చౌడేపల్లెలో సుబ్రమణ్యం, శ్రీధర్‌రాజు, మైనార్టీ నేత సుహేల్‌బాషాపై 7 చొప్పున కేసులు పెట్టారు.
- జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు ఉమాపతినాయుడు, గిరి, శ్రీకాంత్, షామీర్, రెడ్డెప్పనాయుడు, మోహన్‌నాయుడు, నూరుల్లాపై 6 చొప్పున కేసులు నమోదయ్యాయి.
- టీడీపీ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ధనంజయనాయుడు, రమేష్‌నాయుడు, సదుంకు చెందిన సుధాకర్, మైనారిటీ నేత అష్రఫ్ అలీ, మండల పార్టీ అధ్యక్షుడు జి.మాధవరెడ్డిపై 5 చొప్పున కేసులున్నాయి.
- పులిచెర్ల మండలానికి చెందిన టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ, మాజీ సర్పంచి రమేష్, హేమప్రకాశ్‌రెడ్డి, తెలుగుయువత నేత దేవేంద్ర, తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షుడు ఓబులేష్‌రెడ్డిపై 4 చొప్పున కేసులు నమోదయ్యాయి.
- టీడీపీ నాయకులు మహేష్, మునిక్రిష్ణనాయుడు, సురేష్, నాగరాజ, బాలసుబ్రమణ్యంపై 3 చొప్పున పోలీసులు కేసులు నమోదు చేశారు.
- ఇటీవల దాదాపు 50 మందికి పైగా రౌడీషీట్లు తెరిచారు. నియోజకవర్గంలో మరికొందరిపైనా తెరవడానికి పోలీసులు ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం.



రామచంద్రయాదవ్‌పై 47 కేసులు

పుంగనూరుకు చెందిన బీసీవై పార్టీ అధ్యక్షుడు బి.రామచంద్ర యాదవ్‌పై ఇప్పటి వరకు 47 కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ రాజకీయపరమైన అంశాలకు సంబంధించినవే. 2020 జనవరిలో నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి కానుక పంపిణీకి చీరలు, క్యాలెండర్లను తెప్పించారు. పోలీసుల ద్వారా వీటి పంపిణీని అడ్డుకున్నారు. చీరల మధ్యలో కర్ణాటక మద్యం ఉన్నట్లు కేసులు పెట్టారు. అప్పట్నుంచి రామచంద్రయాదవ్ మంత్రి పెద్దిరెడ్డిపై రాజకీయ ఆరోపణలు, విమర్శల స్వరం పెంచారు. ఆయన పర్యటనలకు హైకోర్టు అనుమతిచ్చినా పలమనేరు డీఎస్పీ, చిత్తూరు ఎస్పీ ఆదేశాలతో పుంగనూరు, పలమనేరు సీఐలు ప్రతి కార్యక్రమాన్ని అడ్డుకోవడం, కేసులు నమోదు చేయడం పరిపాటిగా మారింది. ఫిబ్రవరి 6న కూడా గోడ గడియారాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి కర్ణాటక మద్యం ఉన్నట్లు రెండు కేసులు పెట్టారు. యాదవ్‌ను అరెస్టు చేయాలని పోలీసులు ప్రయత్నించినా ఆయన హైకోర్టును ఆశ్రయించడంతో ఊరట లభించింది. పుంగనూరులో ఏకపక్షంగా వ్యవహరిస్తూ తప్పు చేసిన అధికారులకు శిక్ష పడేవరకు న్యాయ పోరాటం చేస్తానని ఆయన స్పష్టంచేశారు. ఇప్పటికే ఎస్పీలు రిషాంత్‌రెడ్డి, జాషువా, డీఎస్పీలు సుధాకర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, సీఐలు గంగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, పలువురు ఎస్‌ఐలు, మరికొందరిపైనా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

చల్లా బాబుపై 16 కేసులు...



పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి (చల్లా బాబు)పై 16 కేసులు నమోదయ్యాయి. టీడీపీ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టాక రాజకీయ పరమైన పర్యటనలు, అంశాలకు సంబంధించి ఈ కేసులు పెట్టారు. గతేడాది ఆగస్టు 4వ తేది చంద్రబాబు పర్యటన సందర్భంగా పుంగనూరు బైపాస్ రోడ్డులో జరిగిన గొడవల నేపథ్యంలో ఒకే సమయంలో జరిగిన ఘటనలకు సంబంధించి ఈయనపై ఏ1గా 7 కేసులు నమోదు చేశారు. మరో 490 మంది వరకు కఠినమైన సెక్షన్లు విధించగా పోలీసులు చాలా మందిని అరెస్టు చేశారు. మరికొందరు లొంగిపోవడంతో కడప, చిత్తూరుసెంట్రల్ జైలు, మదనపల్లె సబ్‌జైలుకు వెళ్లి వచ్చారు. రానున్న ఎన్నికల్లో జిల్లాతో పాటు పుంగనూరులో తప్పులుచేసి గెలవడానికి మంత్రి పెద్దిరెడ్డి ఒకే సామాజిక వర్గానికి చెందిన పోలీసులు, అధికారులను నియమించుకున్నారని, తిరుపతి ఎన్నికల్లో తప్పు చేసిన ఐపీఎస్, ఇతర అధికారులకే శిక్ష తప్పలేదని చల్లా బాబు వ్యాఖ్యానించారు.

ఎస్‌డీపీఐ నాయకుల ఆగ్రహం

పుంగనూరులో సామాజిక సేవలు అందిస్తూ ప్రాణాలకు తెగించి సహాయం చేసిన ఎస్డీపీఐ నాయకులపై పోలీసులు అక్రమకేసులు పెట్టి, రౌడీషీట్లు తెరిచి ఇబ్బంది పెడుతున్నారని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జమీర్ (లాల్), యూసఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పుంగనూరు సీఐపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయం పొందుతామన్నారు.



రౌడీషీట్లు తెరవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎస్డీపీఐ నేతలు (ఫైల్‌ఫొటో)

ఆ ఎస్‌ఐ వద్దంటే వద్దు

ఆ ఎస్‌ఐ అంటే జిల్లాస్థాయి పోలీసు అధికారుల్లో మంచి పేరుంది. సమర్థంగా విధులు నిర్వర్తిస్తారని అంటారు. పార్టీలకతీతంగా పనిచేస్తూ.. బాధితుల పక్షాన నిలబడతారనే ప్రచారం ఉంది. అలాంటి ఎస్‌ఐ చిత్తూరులో అధికారపార్టీకి చెందిన కీలక నేతకు నచ్చలేదు. రెండు నెలల్లోనే ఆయన్ను మార్చేసి తనకు అనుకూలమైన అధికారిని వేసుకున్నారు.

- పట్టుబట్టి బదిలీ చేయించిన వైసీపీ కీలక నేత
- మంచోడని ఉన్నతాధికారులు చెప్పినా బేఖాతరు
- రెండు నెలలకే గుడిపాల ఎస్‌ఐకి స్థానచలనం



చిత్తూరు సమీపం గుడిపాల పోలీస్ స్టేషన్‌కు రెండు నెలల కిందట ఎస్‌ఐ రామ్మోహన్ బి.కొత్తకోట నుంచి వచ్చారు. ఈయన గతంలో పనిచేసిన పీలేరు, సత్యవేడు, శ్రీకాళహస్తి, మదనపల్లె, తంబళ్లపల్లె స్టేషన్లలో మంచి పేరు తెచ్చుకున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. ఈయన గురించి తెలిసి గత ఎస్పీ రిషాంత్‌రెడ్డి బి.కొత్తకోట నుంచి గుడిపాలకు తెచ్చుకున్నట్లు చెబుతారు. తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన గుడిపాల స్టేషనులో ఎస్‌ఐగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి అసాంఘిక కార్యక్రమాలపై రామ్మోహన్ ఉక్కుపాదం మోపారు. కర్ణాటక మద్యం, పేకాట, సారా తయారీ వంటివాటిని కట్టడి చేశారు. రెండు నెలల కాలంలోనే 25 సారా కేసుల్ని నమోదు చేశారు. ఇది అధికారపార్టీ నాయకులకు నచ్చలేదు. నాలుగేళ్లుగా కర్ణాటక మద్యం అక్రమ వ్యాపారం చేస్తున్న అధికారపార్టీకి చెందిన ఓ వ్యక్తిని అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఈయన వచ్చిన కొత్తలో వైసీపీ ప్రజాప్రతినిధికి చెందిన బంధువులు ఆర్గనైజ్డ్ గ్యాంబ్లింగ్ నిర్వహిస్తుంటే వారిని పట్టుకుని రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా కేసు పెట్టేశారు. అప్పటి నుంచే అధికార పార్టీ నాయకులు ఇతన్ని బదిలీ చేయాలని పట్టుబట్టారు. తన విధి నిర్వహణతో తక్కువ సమయంలోనే గుడిపాలలో పేరు తెచ్చుకున్న ఈ ఎస్‌ఐ.. అధికార పార్టీకి నచ్చకుండా పోయారు. ఇతడి వల్ల రాబోయే ఎన్నికల్లో ఇబ్బంది ఎదురవుతుందని వైసీపీ కీలక నేత భావించినట్లు సమాచారం. రెండు నెలల వ్యవధిలోనే ఎస్‌ఐని బదిలీ చేయాలని పట్టుపట్టినట్లు తెలిసింది. ఉన్నతాధికారులు ఎంత సర్దిచెప్పినా, ఈ బదిలీ ఆపేందుకు ప్రయత్నించినా కుదరలేదని పోలీసు వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ ఎస్‌ఐ చిత్తూరు నియోజకవర్గంలో ఉండకూడదని బయటికి పంపించేశారు. గుడిపాల నుంచి కేవలం ప్రొటోకాల్ మాత్రమే చూసుకునే కాణిపాకం స్టేషన్‌కు రామ్మోహన్‌ను బదిలీ చేశారు. కాణిపాకం ఎస్‌ఐ శ్రీనివాస్‌ను గుడిపాలకు వేశారు. వైసీపీ కీలక నేత అడిగి మరీ శ్రీనివాస్‌ను గుడిపాలకు తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఎస్‌ఐ గతంలో ఎస్‌ఆర్‌పురంలో పనిచేసినప్పుడు ఆ వైసీపీ నేతకు అనుకూలంగా ఉన్నారనే ఆరోపణలున్నాయి. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇతన్ని తెచ్చుకున్నట్లు డిపార్ట్‌మెంటులో చెప్పుకుంటున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేశామన్న డీవీఈవో



పీసీఆర్ పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీవీఈవో

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 29: జిల్లాలో శుక్రవారం నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీవీఈవో, పరీక్షల కన్వీనర్ సయ్యద్ మౌల తెలిపారు. ఈ ఏర్పాట్లపై గురువారం ఆయన చిత్తూరులో మీడియాకు వివరించారు. ప్రథమ సంవత్సరం 15,905 మంది, ద్వితీయ సంవత్సరం 16,852 మంది చొప్పున 32,757 మంది విద్యార్థులకు 50 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వీరిలో 4532 మంది ఒకేషనల్ గ్రూపు. 58 మంది పీహెచ్ కేటగిరీ విద్యార్థులు ఉన్నారన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రంలోకి చేరుకోవాలని.. 9 తర్వాత వచ్చేవారికి అనుమతి లేదన్నారు. పీహెచ్ కేటగిరి విద్యార్థులకు ప్రత్యేక సెంటర్‌తో పాటు పరీక్షా సమయం అదనంగా గంట కేటాయించినట్లు వివరించారు. 08572-293867 నెంబరుతో కంట్రోలు రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఏమైనా సమస్యలుంటే ఫోను చేయాలని సూచించారు. జీరో హాజరుతో పరీక్షలు రాసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో విద్యార్థులు ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టిక్కెట్లనైనా అనుమతిస్తామన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి సెంటర్‌లోనూ డెస్కులను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు హాల్ టికెట్ చూపి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు దయానంద రాజు, బాలసుబ్రహ్మణ్యం రాజు, మురళీకృష్ణ, బల్క్ ఇన్‌చార్జి అబ్దుల్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

అలా చెప్పారు.. ఇలా చేశారు!

- చెరువులకు హంద్రీ నీవా జలాల మళ్లింపుపై అధికారుల తీరు




మద్దికుంట గేటు సమీపంలో కట్ట తొలగించడంతో ముందుకు సాగుతున్న జలాలు - అత్తికుప్పం వీరాశీ చెరువుకు వదులుతున్న నీళ్లు

రామకుప్పం, ఫిబ్రవరి 29: 'రామకుప్పం మండలం రాజుపేట నుంచి కిలో మీటరు సమీపంలోని మద్దికుంట చెరువును జలాలతో నింపుతాం. అక్కడి నుంచి నాగసముద్రం, మణీంద్రం చెరువుల మీదుగా కెంచనబల్ల తోట్ల చెరువుకు జలాలు చేర్చే ప్రక్రియ కొనసాగుతుంది' అని బుధవారం నాటి ప్రకటనలో అధికారులు పేర్కొన్నారు.

కానీ, ఆ ప్రకటనకు భిన్నంగా అధికారులు వ్యవహరించారు. మద్దికుంట చెరువు నిండి మొరవ పోకుండానే, కాలువ గేటు మూసేసి, జలాలను అత్తికుప్పం వీరాశీచెరువుకు గురువారం వదిలారు. మద్దికుంట చెరువుకు నీళ్లు ఆపేయడంతో నాగసముద్రం, మణీంద్రం, తోట్లచెరువులను నింపలేని పరిస్థితి. ఒక వేళ వీరాశీచెరువు నుంచి మణీంద్రం చెరువుకు జలాలు పంపాలనుకుంటే ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యమయ్యే పని కాదు. కారణం ఈ రెండు చెరువుల మధ్య వంక ఎక్కడిక్కడ ఆక్రమణలకు గురై పూడ్చేశారు. ఈ ఆక్రమిత వంక భూముల్లో పంటలతో పాటు పలుకుబడి కలిగిన పెద్దలు మామిడి మొక్కలూ నాటేశారు. దీంతో నీటిని వదిలితే ఆ పంటలు దెబ్బతింటాయని, పంటనష్టపరిహారం అందించాలని రైతులు ఆందోళన చేసే అవకాశముంది. ఈ లెక్కన నాగసముద్రం, మణీంద్రం చెరువులకు నీటిని వదిలే ఆలోచన లేనట్లుందని అంటున్నారు. మరోవైపు.. మొన్నటి వరకు మద్దికుంట మొరవ పోతుందని, అక్కడి నుంచి జలాలు నాగసముద్రం, మణీంద్రం, తోట్లచెరువులకు వెళ్లిపోతాయని వైసీపీ శ్రేణులు సోషల్ మీడియాలో ఊదరగొట్టారు. కానీ గురువారం అత్తికుప్పం చెరువుతో పాటు, శాంతిపురం మండలం జీడిగుట్ల వద్ద గల చిట్టీవానివంక వైపు కూడా జలాలను మళ్లించడంతో ఆ ప్రచారమంతా ఉత్తుత్తిదేనంటూ విమర్శలు వస్తున్నాయి. అన్ని చెరువులను నింపేస్తున్నారని, టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారంటూ కొందరు వైసీపీ కార్యకర్తలు సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ చేస్తున్నారు.

ఆ గోప్యత ఎందుకో?

సీఎం నీటిని విడుదల చేసిన రాజుపేట వద్ద కాలువలో ప్రస్తుతం జలాలు అడుగంటిపోతూ స్వల్పంగా ప్రవహిస్తున్నాయి. సోషల్ మీడియాలో మాత్రం జలాలు వేగంగా ప్రవహిస్తున్నట్లు అధికార పార్టీ వైరల్ చేస్తోంది. దీనికి కౌంటర్ సమాధానాలతో అధికార, విపక్ష శ్రేణుల మధ్య వాదోపవాదాలు తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. అదే, హంద్రీ నీవా జలాలు కాలువలో ఏమేర ప్రవాహం ఉంది.. ఏయే చెరువులకు నీటిని మళ్లించనున్నారనే విషయంలో అధికారులు స్పష్టమైన ప్రకటన చేస్తే ఎలాంటి అయోమయం ఉండదు. విమర్శలు ప్రతివిమర్శలకు తావుండదు. మరి, ఈ విషయంలో అధికారులు ఎందుకని గోప్యత పాటిస్తున్నారో?



రాజుపేట వద్ద గేటుకు అవతల పలచగా ఉన్న జలాలు

నీటి మళ్లింపు వెనుక..!

ఇప్పుడున్న నీటి లభ్యతతో గొలుసుకట్టు చెరువులు నింపుకొంటూ పోతే గమ్యస్థానం చేరే అవకాశం లేదు. దీనివల్ల తమ రాజకీయ ప్రయోజనం నెరవేరదని అధికార పార్టీ భావించినట్లు తెలిసింది. అందుకనే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కాలువకు దగ్గరగా ఉన్న ఒకట్రెండు చెరువులకు కొన్ని జలాలను మళ్లించి.. ఆ తర్వాత ఎంతదూరం వెళితే అంతదూరం కాలువలో నీటిని ప్రవహింపచేయాలనే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

వీధి కుక్కల వీరంగం

10 గొర్రెలు మృతి - మరో 10 గొర్రెలకు తీవ్ర గాయాలు



మృతి చెందిన గొర్రెలు

సోమల, ఫిబ్రవరి 29: నంజంపేట గొల్లపల్లెలో బుధవారం అర్ధరాత్రి వీధి కుక్కలు వీరంగం సృష్టించాయి. రెడ్డెప్ప యాదవ్ గొర్రె మందలోని 10 గొర్రెలు మృతి చెందగా మరో 10 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇంటి సమీపంలోని గొర్రెల మందలో ప్రవేశించిన వీధి కుక్కలు విచ్చల విడిగా దాడి చేశాయి. రెడ్డెప్ప కుటుంబ సభ్యులు గొర్రెల అరుపులు విని వచ్చేలోపు వీరంగం సృష్టించాయి. దీంతో పెద్దఉప్పరపల్లె పశువైద్యాధికారి చందనప్రియ సిబ్బందితో కలసి గాయపడ్డ గొర్రెలకు చికిత్సలు అందించారు. వీధి కుక్కలు, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు సచివాలయంలో ఫిర్యాదు చేశారు.

ఒంటరి ఏనుగు విధ్వంసం



ఏనుగు విరిచేసిన రాతి కూసాలు

ఐరాల, ఫిబ్రవరి 29: ఐరాల మండలం వినాయకపురంలోని పొలాల్లో ఒంటరి ఏనుగు మామిడి తోటను ధ్వంసం చేసింది. వంట పొలాలు, బోర్లు విరిచి వేసింది. మోహన్‌రెడ్డికి చెందిన మామిడి తోట కంచెను ధ్వంసం చేసింది. వీరభద్రారెడ్డి, వినయ్‌రెడ్డికి చెందిన మామిడి చెట్ల కొమ్మలను విరిచి వేసింది. ఏనుగు సంచరిస్తుండటం వలన రైతులు రాత్రి సమయంలో పొలాల వద్దకు వెళ్లడానికి భయపడుతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగును దూరంగా తరిమి వేయాలని రైతులు కోరుతున్నారు.

3న పోలియో చుక్కల కార్యక్రమం

- 0-5 ఏళ్ల పిల్లలకు వేయించాలన్న కలెక్టర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

చిత్తూరు, ఫిబ్రవరి 29: జిల్లాలో మార్చి 3వ తేదీన 0-5 ఏళ్లలోపు పిల్లలకు విధిగా పోలియో చుక్కలను వేయించాలని, ఆ దిశగా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. గురువారం పోలియో చుక్కలకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పోలియో చుక్కలు వేసుకోని పిల్లలకు 4, 5 తేదీల్లో ఇంటింటికి వెళ్లి వేయించాలన్నారు. జిల్లాలో 69 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ కేంద్రాల పరిధిలో ఎనిమిది మంది ప్రోగ్రామ్ అధికారుల ద్వారా 142 రూట్లలో 1415 కేంద్రాల ద్వారా 209971 మంది ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉందన్నారు. ఇందులో 149 హైరిస్క్ ప్రాంతాలను గుర్తించామని, వీటిని మొబైల్ బూత్‌ల ద్వారా కవర్ చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాల అధికారి రవిరాజు, డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి, డీపీఎంవో హర్షవర్ధన్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు జేవీడీ నిధుల విడుదల



మాట్లాడుతున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు, ఫిబ్రవరి 29: ఎస్సీ ఎస్టీ బీసీ, ఈబీసీ విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరానికి జగనన్న విద్యాదీవెన మొదటి విడత నిధులను శుక్రవారం తల్లుల ఖాతాలకు జమ చేయనున్నారు. ఉదయం 11 గంటలకు కృష్ణా జిల్లా పామర్రులో సీఎం జగన్ బటన్ నొక్కి నిధులు జమ చేస్తారని జిల్లా బీసీ సంక్షేమం సంఘం, సాధికారిత అధికారి రబ్బానీ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. 32427 మంది విద్యార్థులకు రూ.20.54 కోట్లను ప్రభుత్వం విడుదల చేయనుందని తెలిపారు.

ఎన్నికలను సమన్వయంతో నిర్వహించాలి : డీఆర్వో

చిత్తూరు, ఫిబ్రవరి 29: రాబోయే సార్వత్రిక ఎన్నికలను అధికారులందరూ సమన్వయం చేసుకుని విజయవంతం చేయాలని డీఆర్వో పుల్లయ్య కోరారు. గురువారం డీఆర్‌డీఏ సమావేశపు హాలులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివయ్యతో కలిసి సార్వత్రిక ఎన్నికల్లో నిర్వర్తించాల్సిన బాధ్యతలపై నోడల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు 16 బృందాలను ఏర్పాటు చేశామని, ఇకపై ప్రతి రోజు నోడల్ అధికారులతో పాటు వారికి కేటాయించిన సహాయక సిబ్బంది ఎన్నికల పనులను చేయాల్సి ఉందన్నారు. ప్రతి రోజు రిపోర్టులను ఆర్వోల ద్వారా మాత్రమే పంపించాలన్నారు. ఎక్కువ ఫిర్యాదులు ఎంసీసీ నుంచి వస్తాయని, వాటిని బాధ్యతగా తీసుకుని పనిచేయాలన్నారు. అందరికీ శిక్షణ ఇవ్వడం ద్వారా ఎన్నికల్లో ఎలాంటి పొరబాట్లకు తావులేకుండా జరిగే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో నోడల్ ఆఫీసర్లు, సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రికొండ అడవికి నిప్పు



శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 29: ఎస్ఆర్‌పురం మండలం పుల్లూరు క్రాస్ రోడ్డు సమీపంలోని ఎర్రికొండ అడవికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఆకతాయిల చర్యతో అడవిలోని జీవరాశులు, చెట్లు కాలి బూడిదయ్యాయి. గతంలోనూ అడవికి నిప్పు పెట్టినా.. అటవీశాఖ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు నిఘా పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పద్మావతి వర్సిటీలో యూఎస్ కాన్సులేట్



యూఎస్ కాన్సులేట్ నౌషేన్ అలీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 29: పద్మావతి మహిళా యూనివర్సిటీని యూఎస్ కాన్సులేట్ నౌషీన్ అలీ గురువారం సందర్శించారు. యూఎస్‌ఏలో విద్యా ఉపాధి అవకాశాలకు సంబంధించిన విషయమై వీసీ ప్రొఫెసర్ భారతితో ఆమె చర్చించారు. అవగాహనా ఒప్పందాలు చేసుకుని పరస్పరం బోధన, పరిశోధన రంగాల్లో సహకరించుకుంటామని వీసీ భారతి, నౌషీర్ అలీ పేర్కొన్నారు. రిజిస్ట్రార్ రజని పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకారంలో కాటమరాజు - చాందిని బండిలో ఊరేగుతున్న కాటమరాజు - ప్రత్యేక అలంకారంలో చాందిని బండ్లు

వైభవంగా ఆవుల పబ్బం వేడుకలు

చౌడేపల్లె, ఫిబ్రవరి29: ఆవుల పబ్బం పేరుతో నిర్వహించే సంక్రాంతి పండుగ గురువారం వైభవంగా ప్రారంభమైంది. మండలంలోని నుంజార్లపల్లె, సింగిరిగుంట, నూనెముద్దలపల్లె, పేరావాండ్లపల్లె, పరికిదొన, దొనపల్లె, చిన్నకంపల్లె, మల్లెలవారిపల్లె, దిగువమల్లెలవారిపల్లె, సామిరెడ్డిపల్లె, మదుకూరు, మొరంకిందపల్లె, చౌడగానిపల్లె, గడ్డంవారిపల్లె గ్రామాల ప్రజలు ఆవుల పబ్బం పేరుతో సామూహికంగా పశువుల పండుగ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నుంజార్లపల్లె చాందిని బండిలో కాటమరాజు ఉత్సవమూర్తిని ఏర్పాటుచేసి మంగళవాయిద్యాలు, కోలాటలు, చెక్కభజనలు, బల్లారి డ్రమ్స్‌తో గ్రామాలలో ఊరేగిస్తూ పరికిదొన సమీపంలో ఉన్న నాగప్ప చెరువు వద్దకు తీసుకు వచ్చారు. అలాగే దిగువమల్లెలవారిపల్లె నుంచి రెండు చాందిని బండ్లు, దొనపల్లె, పరికిదొన, పరికిదొన ఎస్సీ కాలనీ, పేరావల్లె, నూనెముద్దలవారిపల్లె గ్రామాల నుంచి చాందిని బండ్లు నాగప్ప చెరువు వద్దకు వచ్చాయి. పశువులను ప్రత్యేకంగా అలంకరించి నాగప్ప చెరువ వద్దకు తీసుకువచ్చి కాటమరాజు విగ్రహానికి ప్రదక్షణలు చేయించారు. కాటమరాజు ఉన్న చాందినిబండి వెంట నాగప్పచెరువు కట్ట నుంచి దొనపల్లె అటవీ ప్రాంతంలో ఉన్న కాటమరాజు ఆలయం వద్దకు వెళ్లాయి. చాందినిబండ్లను చూసేందుకు 14 గ్రామాల ప్రజలు నాగప్పచెరువు వద్దకు రావటంతో చెరువు జన సంద్రంగా మారింది.

అంతా అయ్యాక అనుమతులు!

టీటీడీ ఉద్యోగుల లేఅవుట్‌కు వ్యవసాయ భూమి నుంచి రెసిడెన్షియల్‌గా వర్గీకరణ - ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్డు రద్దు

తిరుపతి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమిలో ఏదైనా లే అవుట్ వేయాలంటే నివాసయోగ్యమైన స్థలంగా ప్రభుత్వం దగ్గర మార్చుకోవాలి. ఆ తర్వాత స్థానిక పట్టణాభివృద్ధి సంస్థ అప్రూవల్ తీసుకోవాలి. అప్పుడే ప్లాట్లను విక్రయించడం, రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంది. కానీ టీటీడీ ఉద్యోగులకు వడమాలపేట దగ్గర ఇచ్చిన ప్లాట్లకు మాత్రం ఇలాంటి నిబంధనలు ఏమీ వర్తించలేదు. ఎలాంటి అనుమతులూ లేకుండానే పేపర్‌పై స్కెచ్ వేసి, లాటరీ తీసి నెంబర్లు కేటాయించేశారు.అంతేకాదు కొందరికి రిజిస్ట్రేషన్ తంతు కూడా పూర్తిచేశారు. అంతా అయ్యాక ఇప్పుడు భూమి మార్పు కోసం అందులోని ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్డు రద్దు కోసం ప్రభుత్వ ఉత్తర్వులు తీసుకున్నారు.ఈ మేరకు గురువారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగపు ముఖ్యకార్యదర్శి శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. వడమాలపేట మండలం, పాదిరేడు అరణ్యం గ్రామంలోని 417.16 ఎకరాల వ్యవసాయ భూమిలో టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించారు. అయితే వ్యవసాయ భూమి నుంచి రెసిడెన్షియల్‌గా వర్గీకరణ జరగలేదు. ఇటీవల జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు దాదాపు రూ.5.5కోట్లు తుడాకు టీటీడీ చెల్లించింది. దీంతో రెసిడెన్షియల్‌గా మార్పు చేయడంతో పాటు సదరు స్థలంలో 60 మీటర్ల తుడా ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్డును కూడా రద్దుచేస్తూ శ్రీలక్ష్మి ఉత్తర్వులు ఇచ్చారు.దీనితర్వాత మళ్లీ లే అవుట్ అప్రూవల్ తీసుకోవాల్సివుంది.సాధారణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ప్రైవేట్ సంస్థలకు అన్ని అనుమతులూ ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తారు. మరి అనుమతులు లేకుండా టీటీడీ ఉద్యోగులకు జరుగుతున్న రిజిస్ట్రేషన్లు ఎంత వరకు చెల్లుబాటవుతాయన్న ఆందోళన ఉద్యోగుల్లో కనిపిస్తోంది.

ప్రత్యేకహోదాయే ప్రధానాస్త్రం

నేడు తిరుపతిలో కాంగ్రెస్ భారీ బహిరంగసభ

పదేళ్ళ కిందట మోదీ హామీలిచ్చిన చోటే నిర్వహణ

ఏఐసీసీ నేత సచిన్ పైలెట్, పీసీసీ చీఫ్ షర్మిల రాక



తిరుపతి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శుక్రవారం సాయంత్రం భారీ బహిరంగసభ నిర్వహణకు కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేపట్టింది. ఎస్వీ యూనివర్శిటీ స్టేడియంలో నేటి సాయంత్రం 4 గంటలకు జరగనున్న బహిరంగసభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలెట్, పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల,రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు తదితరులు హాజరు కానున్నారు. దీనికోసం సచిన్ పైలెట్ బెంగుళూరు నుంచీ షర్మిల హైదరాబాదు నుంచీ విమానాల్లో తిరుపతి చేరుకోనున్నారు. 2014 ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుపతిలో నిర్వహించిన బహిరంగసభలో నరేంద్ర మోదీ బీజేపీ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదాతో పాటు రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లో బీజేపీ సభ నిర్వహించిన ఎస్వీయూ స్టేడియంలోనే ఇపుడు కాంగ్రెస్ పార్టీ కూడా బహిరంగసభ ఏర్పాటు చేస్తోంది. అదే చోట సభ జరిపి మోదీ హామీలను ప్రజలకు గుర్తు చేయడంతో పాటు హామీల అమలుపై మోదీని కాంగ్రెస్ నేతలు నిలదీయనున్నారు. వైఎస్ షర్మిల పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక ఇదివరకే తిరుపతిలో సమావేశం నిర్వహించినప్పటికీ అది పార్టీ అంతర్గత సమావేశం. బహిరంగసభ జరపడం మాత్రం ఇదే తొలిసారి. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో తొలి బహిరంగసభ కావడంతో దీన్ని ఎలాగైనా విజయవంతం చేయాలని పార్టీ నాయకులు శ్రమిస్తున్నారు. 30 వేలమందితో సభ జరపాలని, దానికోసం ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా జనసమీకరణ చేయాలని ప్రయత్నిస్తున్నారు. బహిరంగ సభా స్థలిలో ఏర్పాట్లను గురువారం పీసీసీ మాజీ చీఫ్ గిడుగు రుద్రరాజు, మాజీ ఎంపీ చింతా మోహన్, పీసీసీ నేత తులసిరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

ఆస్తి కోసం తమ్ముడినే చంపేశాడు!

- పులిబోనువారిపల్లెవాసి హత్య కేసులో సోదరుడు సహా నలుగురికి రిమాండ్



హతుడు చంద్రశేఖర రెడ్డి (పాత చిత్రం)

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 29: ఆస్తి కోసం అన్నే తన కుమారుడితో కలిసి తమ్ముడిని దారుణంగా నరికి చంపేశాడని పోలీసులు నిర్ధారించారు. తిరుపతి రూరల్ మండలం కాలూరు క్రాస్ వద్ద ఈనెల 25న జరిగిన చంద్రశేఖరరెడ్డి (50) హత్య కేసులో నలుగురు నిందితులను రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎర్రావారిపాలెం మండలం, నెరబైలు పంచాయితీ, పులిబోనువారిపల్లెకు చెందిన భాస్కరరెడ్డి కుమారులు రామ్మోహన్ రెడ్డి, చంద్రశేఖరరెడ్డి(50)కి నడుమ ఆస్తి తగాదాలున్నాయి. రౌడీషీటరైన రామ్మోహన్‌రెడ్డి కాన్స్టేబుల్‌గా తిరుపతి బొమ్మగుంటలో నివాసం ఉంటుండగా చంద్రశేఖరరెడ్డి స్వగ్రామంలోనే నివసిస్తున్నాడు. చంద్రశేఖరరెడ్డి కుమారులు కాలూరు క్రాస్ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతూ హాస్టల్లో ఉంటున్నారు. ఈనెల 25న ఆదివారం కావడంతో పిల్లలను చూసేందుకు చంద్రశేఖరరెడ్డి ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వచ్చాడు. పిల్లలు తినుబండారాలు కావాలనడంతో బయటకు వచ్చిన చంద్రశేఖరరెడ్డి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. పాఠశాల సమీపంలోనే మాటువేసిన ఆయన అన్న రామ్మోహన్‌రెడ్డి, ఆయన కుమారుడు పురుషోత్తం రెడ్డి, అతని స్నేహితులు యోగి, చింతకాయల వీధికి చెందిన మరో మైనర్ బాలుడు కలిసి చంద్రశేఖరరెడ్డిపై దాడి చేశారు. బైక్ పైనుంచి కిందపడిపోయిన చంద్రశేఖరరెడ్డి పారిపోయేందుకు ప్రయత్నించగా ఆ ఐదుగురూ వెంటాడి కత్తులతో నరికి చంపారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు గురువారం నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. రామ్మోహన్‌రెడ్డిపై అలిపిరి పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్, ఎర్రావారిపాలెం పోలీసు స్టేషన్‌లో కేసులున్నాయి.

ఈ పదేళ్లలో అత్యద్భుత ఆవిష్కరణలు

కేంద్ర రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి



సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న డాక్టర్ సతీష్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 29: గడిచిన పదేళ్లలో దేశంలో ఎన్నో అత్యద్భుత ఆవిష్కరణలు జరిగాయని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. అఖిల భారత శిక్షక్ మహా సంఘ్(ఏబీఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్లో ఆత్మ నిర్భర భారత్ - సైన్స్ అండ్ టెక్నాలజీ అంశంపై గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ రక్షణ రంగంలో పదేళ్లలో ఎన్నో గొప్ప పనులు జరిగాయన్నారు. ఆ రంగంలో జరిగిన పరిశోధనలు, ఆవిష్కరణలు ఇందుకు నిదర్శనమన్నారు. నూతన ఆయుధాల కొనుగోళ్లకు విదేశాలపై ఆధారపడటం చాలా వరకూ తగ్గిందన్నారు. తద్వారా రూ.వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడుకున్నామన్నారు. 2047 నాటికి దేశాన్ని విశ్వగురువుగా నిలిపే బాధ్యత యువతపై ఉందని గుర్తు చేశారు. యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలు ఇందుకు అవసరమైన బాధ్యతను స్వీకరించాలని కోరారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ శతాబ్దం చివరికి శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన రంగంలో మన దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ నేత లక్ష్మణ్ మాట్లాడారు. ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ వైపీ రామిరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీకి అశోకరాజు రాజీనామా

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 29: టీడీపీకి రాజీనామా చేస్తున్నట్లు పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, సిద్ధార్థ ఇంజనీరింగు కళాశాలల చైర్మన్ అశోకరాజు ప్రకటించారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సుదీర్ఘకాలం పార్టీలో తనను ఆదరించి అవకాశం కల్పించినందుకు చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే తన భవిష్యత్తు కార్యాచరణను చెబుతానన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మళ్లీ ప్రోటోకాల్ వివాదం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మళ్లీ ప్రోటోకాల్ వివాదం తెరమీదకు వచ్చింది. నిత్యం వివాదాల్లో ఉండే శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం వారు మరో వివాదంలో చిక్కుకున్నారు. 2022వ సంవత్సరం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆహ్వాన పత్రికల్లో ఎంపీ గురుమూర్తి ఫొటో, పేరు విస్మరించిన దేవస్థానం అధికారులు, ఈ సారి ఎమ్మెల్సీ సభ్యులను విస్మరించారు. ఆహ్వాన పత్రికలు అట్టహాసంగా విడుదల చేశారు. అందులో భారీగా ప్రోటోకాల్ తప్పిదాలు వెలుగు చూడటంతో అందరూ విస్తుపోయారు. దాంతో పత్రికలు బయటకు రాకుండా అప్పటికప్పుడే దాచేశారు. ముందు పేజీలో సీఎం ప్రోటోకాల్ ముద్రించాల్సి ఉండగా ఆలయపాలక మండలి సభ్యుల పేర్లను అచ్చు వేశారు. ఇలాంటి వివాదాల ఆహ్వాన ప్రతికపై స్థానిక నేతగా ఉన్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఫొటో అచ్చు వేయలేదన్న ప్రశ్న పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. దీనిపై చైర్మన్ అంజూరు శ్రీనివాసులు విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ఆలయ చరిత్రలో ఇప్పటివరకు ఏ ఎమ్మెల్సీ ఫొటో కూడా వేయలేదన్నారు. ఈ సారి మళ్లీ ఆహ్వాన పత్రికలు ముద్రించాల్సి వచ్చింది కాబట్టి జిల్లాలోని అందరి ఎమ్మెల్సీల చిత్రాలు పొందు పరుస్తామన్నారు. ఈ క్రమంలో మిద్దెల హరి ఇటీవల ఆర్టీసీ వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. గురువారం జరిగిన సమన్వయ సమావేశానికి ఆయన్ను ఆహ్వానించ లేదు. దీంతో ఆయన పలువురి వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. క్యాబినెట్ స్థాయి కలిగిన తనను దేవస్థానం వారు విస్మరించడం ఎంతవరకు సమంజసమని ఆయన వాపోతున్నట్టు తెలిసింది. అధికారులకు తెలియకపోయి నా మండలి అయినా ఎందుకు చొరవతీసుకో లేదన్నది రాజకీయంగా చర్చకు దారి తీస్తోంది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి29(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 66,915 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,784 మంది తలనీలాలు సమర్పించారు. కాగా, ఎంపీ ప్రఫుల్ పటేల్ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

రేపు డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమాన్ని శనివారం ఉదయం తిరుమలలో నిర్వహించనున్నారు. అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సలహాలు, సూచనలు, ఫిర్యాదులను ఈవో ధర్మారెడ్డి దృష్టికి తీసుకురావచ్చు. దీనికోసం 0877-22630261ను సంప్రదించాల్సి ఉంటుంది.

టెట్‌కు 729 మంది హాజరు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 29: జిల్లాలోని మూడు, చెన్నైలోని ఒక సెంటర్‌లో మూడో రోజైన గురువారం నిర్వహించిన టెట్‌కు 729 మంది హాజరైనట్లు డీఈవో దేవరాజు తెలిపారు. మొత్తం 826 మంది అభ్యర్థులకు గాను 729 మంది హాజరు కాగా, 97 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఉదయం సెషన్‌లో 413 మందికిగాను 353 మంది.. మధ్యాహ్నం 413కిగాను 376 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురంలోని వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు గురువారం ఉదయం ధ్వజారోహణ వేడుక వైభవంగా జరిగింది. శాస్త్రోక్తంగా గరుత్మంతుడిని కొత్త వస్త్రంపై లిఖించి కంకణ భట్టర్ శేషాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేసి, ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు.రాత్రి వాహన సేవలు ప్రారంభమయ్యాయి. పెద్ద శేష వాహనంపై కృష్ణావతారంలో వైకుంఠనాథుడు భక్తులకు దర్శనమిచ్చారు.

- చంద్రగిరి

శివరాత్రి ఉత్సవాల్లో సామాన్యులకే పెద్దపీట



సమన్వయ సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: ముక్కంటి ఆలయంలో జరగబోయే మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకే పెద్దపీట వేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని త్రినేత్ర అతిథి భవనంలో గురువారం పలు ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులను గత ఉత్సవాల నిర్వహణపై కలెక్టర్ ఆరా తీశారు.ఈ ఏడాది అమలు చేయాల్సిన విధానాలపై సూచనలు చేశారు. అత్యవసర సేవలపై అధికారులు నిరంతరం అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు.బాల్య వివాహాల నిర్మూలనకు రెవెన్యూ ఐసీడీఎస్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని చెప్పారు.ఉత్సవాల సమయంలో ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ, వైద్య విధాన పరిషత్ అధికారులను ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని పురపాలక శాఖను, నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. అగ్నిమాపక వాహనం, 108 వాహనం ఆలయం వద్దనే నిరంతరం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ అంశాలపై ఎస్పీ మలిక గార్గ్ పలు సూచనలు చేశారు.గత ఏడాది ఉత్సవాల్లో బందోబస్తును పర్యవేక్షించిన సీఐ అంజుయాదవ్ సమావేశానికి హాజరై క్యూలైన్ల విధానం, రద్దీ రోజుల్లో బందోబస్తు నిర్వహణ, రథోత్సవం, తెప్పోత్సవంలో చోరీలు జరగకుండా తీసుకున్న జాగ్రత్తలను వివరించారు.అనంతరం కలెక్టర్, ఎస్పీ ఈ ఏడాది అమలు చేయాల్సిన ఏర్పాట్లపై ఆలయంలో తిరిగి కసరత్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, ఆర్డీవో రవిశంకర రెడ్డి, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు కలెక్టర్, ఎస్పీ ఆలయానికెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.నిత్యాన్నదానంలో కలెక్టర్ భక్తులతో కలిసి భోంచేశారు.

డీడీఈ సైకాలజీ ఫలితాలు విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 29 : ఎస్వీయూ దూరవిద్యా సైకాలజీ మొదటి, ద్వితీయ సంవత్సర ఫలితాలు విడుదలయ్యాయి. మన బడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఈ ఫలితాలు పొందుపర్చినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సదుం : సదుం గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్ ప్రవేశానికి ఈనెలాఖరు వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. 5వ తరగతి వారికి ఏప్రిల్ 27న, ఇంటర్ వారికి ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆయన వెల్లడించారు.

చేతుల తడిపితేనే హౌసింగ్ బిల్లులు

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి29: హౌసింగ్‌శాఖలో ఇళ్ల బిల్లులు కావాలంటే అధికారుల చేతులు తడిపితేనే మంజూరు చేస్తున్నారని, లేని వారికి బిల్లులు ఇవ్వడం లేదని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు బిల్లులు ఇవ్వకుండా హౌసింగ్ అధికారులు ఇబ్బందులు పెటుతున్నట్లు తెలిపారు. నక్కబండకు చెందిన ఓ బాధితురాలు ఇంటి బిల్లు కోసం రూ. 25వేలు చెల్లించినా బిల్లులు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏడాది పూర్తి అవుతున్నా ఇప్పటి వరకు ట్యాబ్‌లు ఇవ్వలేదని, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు ఇష్టారాజ్యంగా వసూళ్లు చేస్తున్నారని, అధికారులు ఏమి చేస్తున్నారని నిలదీశారు. దళిత నాయకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గౌదల గంగమ్మ అనే వ్యాధితో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, వైద్యాధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. డాక్టర్ సల్మా మాట్లాడుతూ ఆ వ్యాధి వల్ల ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ ఆసుపత్రిలో వ్యాధికి మందులు ఇస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ ఆంజప్ప మాట్లాడుతూ సింగిరిగుంట సమీపంలో మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన కంపోస్టు యార్డులో వ్యర్థ పదార్థాలను కాల్చడం వల్ల అందులోనుంచి వెలువడే పొగ వల్ల చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే చెత్తను తరలిస్తున్న ట్రాక్టర్ల నుంచి వ్యర్థపు చెత్త రోడ్లపై పడటం వల్ల దుర్వాసన వస్తోందని తెలిపారు. మున్సిపల్ మేనేజర్ రసూల్‌ఖాన్ మాట్లాడుతూ చెత్త రోడ్డుపై పడకుండా తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథ్‌రెడ్డి, ఎంపీడీవో మునిరెడ్డి, డీటీ నసీనా, ఎస్సీఎస్టీ మానిటరింగ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు

సోమల, ఫిబ్రవరి 29: ఇంటర్ పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట నరసింహులు చెప్పారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. సకాలంలో పరీక్షా కేంద్రం వద్దకు చేరుకోవాలన్నారు. కళాశాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు, దుకాణాలు తెరవరాదన్నారు. లౌడ్ స్పీకర్లు అనౌన్స్‌మెంట్లు చేయరాదని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో టీడీపీ విజయం : చల్లా

సోమల, ఫిబ్రవరి 29: సూపర్ సిక్స్ పథకాలతో టీడీపీ విజయం తథ్యమని పుంగనూరు ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీలోని గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని వైసీపీ కుట్రలు పన్నుతోందన్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు వీటిని తిప్పి కొట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, సూరిశెట్టి నాగభూషణం, కొల్లా హరిప్రసాద్, పీఎం మల్లికార్జున, శివశంకర్, ఉమాపతి నాయుడు, బంగారప్ప, రఫీ, వినోద్ కుమార్, వేణుగోపాల్ నాయుడు, మహేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌లో 300 రోజులుగా అన్నదానం



పలమనేరు, ఫిబ్రవరి29 : పలమ నేరులో మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ఆధ్వర్యంలో పునఃప్రారంభించిన అన్నక్యాంటీన్‌లో అన్నదాన కార్య క్రమం గురువారం నాటికి 300 రోజులకు చేరింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు ప్రతిరోజు అన్నదానం చేయాలన్న సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా అన్నక్యాంటీన్లు ప్రారంభించారు. అయితే వైసీపీ అధికారంలోకి రాగానే అన్నక్యాంటీన్లను ప్రభుత్వం రాజకీయ కక్షతో మూసేసింది. అయితే పలమనేరులో మాత్రం మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నక్యాంటీన్‌ను పునః ప్రారంభించారు.

శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన



చౌడేపల్లె, ఫిబ్రవరి29: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో రెండవ రోజు శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన జరిగింది. గురువారం అమ్మవారికి అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. మాఘమాసం సందర్భంగా కొండపై ఉన్న డార్మిటరీ హాల్‌లో అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి, కలశస్థాపన చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారి వెండి ప్రతిమకు ఉభయదారులచే లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం గణపతి, ఆదిత్య, నవగ్రహ, చండీహోమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి లక్ష కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఉభయదారులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి అందజేశారు

ప్రతి ఇంట్లో మహిళ శక్తి గురించి చర్చ జరగాలి

శాంతిపురం, ఫిబ్రవరి 29 : ప్రతి ఇంటిలోనూ మహిళ శక్తి పథకం గురించి చర్చ జరగాలని కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్‌నాయుడు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురా లు అరుణ, కుప్పం నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు అనసూయ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో మహిళా బూత్ కమిటీ మెంబర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ చంద్రబాబు అధి కారంలో ఉన్నప్పుడు నిత్యం మహిళల గురించే ఆలోచించేవార న్నారు. వంటిం టికే పరిమితం అయిన మహిళలను వెలుగులోకి తెచ్చిన ఘనత చంద్రబాబు దేనన్నారు. అలాంటి వ్యక్తి వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నో అవ మానాలు పడుతూ, ఇబ్బందులు ఎదుర్కొంటు రాష్ట్ర భవిష్యత్తు కోసం, రానున్న బిడ్డల భవిష్యత్తు కోసం ఒక సైకోతో యుద్ధం చేస్తున్నారన్నారు. అలాగే ప్రజల సంక్షేమం కోసం ప్రకటించిన మహిళ శక్తి గురించి ప్రతిఇంటికి వెళ్లి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల మహిళ అధ్యక్షురాలు శ్యామల, ప్రధాన కార్య దర్శి రూప, బూత్ కమిటీ మెంబర్లు టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

పలమనేరు, ఫిబ్రవరి29 : పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్‌పోటీలు, స్లోగన్ రైటింగ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రామన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని కొత్త విషయాలను కనుగొని దేశానికి గుర్తింపు తీసుకు రావాలన్నారు. సమాజానికి ఉపయోగ పడే సైన్స్ ఆవిష్కరణలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అన్ని విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్‌కు గంగవరం విద్యార్థినులు

గంగవరం, ఫిబ్రవరి 29 : రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్‌కు గంగవరం హైస్కూల్ విద్యార్థినులు ఎంపికైనట్లు హైస్కూల్ హెచ్‌ఎం పరశురామ్ తెలిపారు. గత నెల 2, 3వ తేదీలలో మదర్‌థెరీసా కళాశాలలో గంగవరం హైస్కూల్ విద్యార్థినులు హంస్నా, ఆలియాలు ఎలక్ట్రానిక్ డివైస్ అనే నమూనాను ప్రదర్శించారు. ఈనెల 1, 2తేదీలలో హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్‌లో హంస్నా, ఆలియా హాజరవుతున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.

రాజుకాలువ పూడ్చివేతపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

గంగవరం, ఫిబ్రవరి 29: గంగవరం నడిబొడ్డున రియల్టర్లు రాత్రికి రాత్రే రాజుకాలువను మూసేశారని సాయిమహాలక్ష్మి కాలనీవాసులు గురువారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు... దశాబ్దాల కాలంగా ఉన్న రాజుకాలువను రెండురోజుల క్రితం రియల్టర్లు మూసివేసి ప్లాట్లు వేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ ఆక్రమణ ఇదే ప్రాంతంలోని ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యమే చేపడుతోందన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి రాజుకాలువను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

సూపర్ బజార్‌లో కొనుగోలు ధరకే అమ్మకాలు



మాట్లాడుతున్న ఆర్.వి.సుభాష్‌చంద్రబోస్

పలమనేరు, ఫిబ్రవరి29 : పలమనేరు వి.బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్‌లో మార్చి 1వ తేది నుంచి కొన్న ధరలకే విక్రయాలు ప్రారంభిస్తున్నట్లు సూపర్ బజార్ అధ్యక్షుడు ఆర్.వి. సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. ఈ విక్రయాలు మార్చి 1నుంచి మార్చి 31వ తేది వరకు ఉంటాయన్నారు. ఆదివారాలు సైతం విక్రయాలు వుంటాయని తెలిపారు. సూపర్ బజార్ వార్షిక విక్రయాలు రూ. 16 కోట్లు దాటిందన్నారు. వ్యాపార లావాదేవీలు ప్రతి సంవత్సరం ఆడిట్ చేయించి సర్వసభ్య సమావేశంలో సభ్యులకు వివరించి వారి ఆమోదం పొందుతున్నామని తెలిపారు. వచ్చిన లాభం పూర్తిగా సభ్యులకు పంచి పెట్టే అవకాశం లేనందున కొన్న ధరలకే వినియోగదారులకు విక్రయించనున్నట్లు తెలిపారు.

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపుదాం : అమర్

వి.కోట, ఫిబ్రవరి 29: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలందరూ సిద్ధంకావాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. గురువారం వి.కోటలో ఇంటింటా తిరుగుతూ పార్టీని ఆదరించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, కార్యదర్శి ఈశ్వర్, ధీరజ్, శబరీష్, రాంబాబు, చౌడప్ప, నారాయణస్వామి తదితరులు ఉన్నారు. అలాగే వి.కోట పీఎంఆర్ కళ్యాణ మండపంలో క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్, బూత్ కమిటీ ఇన్‌ఛార్జులతో సమావేశమై పార్టీ స్థితిగతులపై చర్చించారు.

రేపు కంటి వైద్యశిబిరం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి29: ఈనెల 2వ తేదీన టీఎంఎస్‌క్లబ్ ఆవరణలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు రోటరీక్లబ్ సభ్యులు తెలిపారు. గురువారం కంటి వైద్యశిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి వైద్యనిపుణులతో కంటిలో శుక్లాలు ఉన్న వారిని గుర్తించి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామన్నారు. శిబిరానికి వచ్చే వారు తలస్నానం చేసి ఆధార్, రేషన్‌కార్డు, ఓటర్‌కార్డుల జిరాక్స్‌లు, 3 ఫొటోలు తీసుకురావాల్సి వుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అనిల్‌కుమార్, రాజారెడ్డి, భాస్కర్, త్యాగరాజు, గణేశ్, మునిరాజ తదితరులు పాల్గొన్నారు

కుప్పం రెస్కో ఎండీగా ప్రభాకర్

కుప్పం, ఫిబ్రవరి 29: కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ (రెస్కో) నూతన ఎండీగా ప్రభాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఎండీగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం పదవీ విరమణ చేశారు ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని చెప్పారు. వినియోగదారులు బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

త్వరలోనే డివైడర్ల ఏర్పాటు

పుంగనూరు, ఫిబ్రవరి29: పట్టణంలో త్వరలోనే డివైడర్లు ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీం బాషా పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోడ్డు వెడల్పు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు వల్ల ట్రాఫిక్ అంతరాయం తగ్గుతుందన్నారు. కౌన్సిలర్ మనోహర్ మాట్లాడుతూ అజెండా అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. నక్కబండలో ఇళ్లకు ట్యాక్స్ వేయకుండా మున్సిపల్ రెవెన్యూఅధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రికార్డులు ఉన్న ఇళ్లను ట్యాక్స్ వేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే అన్ని ఇళ్ల రికార్డులు పరిశీలించి ట్యాక్స్ వేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా నాగేశ్వరరావు

కుప్పం, ఫిబ్రవరి 29: కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా గురువారం నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఆత్మకూరు మున్సిపాలిటీ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, కౌన్సిలర్లు, సిబ్బంది కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

కండెక్టర్‌కు సన్మానం

కుప్పం, ఫిబ్రవరి 29: కుప్పం ఆర్టీసీ డిపోలో 30 ఏళ్లుగా కండెక్టర్‌గా పనిచేసిన రంగనాథాన్ని గురువారం ఎన్ఎంయూఏ నాయకులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఇ.జయపాల్ ఆధ్వర్యంలో సభ ఏర్పాటు చేసి ఆర్టీసీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ సంయుక్త కార్యదర్శి జిమునెప్ప, సినాయక్, నారాయణ, జేవీ.రమణ, వెంకటేశ్, దిలీప్, జయశంకర్, అరుణ్, బాష, కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ వాయిదా

పలమనేరు, ఫిబ్రవరి29 : పలమనేరు కోర్టు ఆవరణలో ఈనెల 9వ తేది జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 16వ తేదికి వాయిదా వేసినట్లు సీనియర్ సివిల్ జడ్జి పగడాల శ్రీనివాసరావు తెలిపారు. ఏపీ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు లోక్ అదాలత్‌ను వాయిదా వేసినట్లు తెలిపారు. కక్షిదారులు, న్యాయవాదులు ఈవిషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

విజలాపురంలో గ్రామ వికాస సమావేశం

రామకుప్పం, ఫిబ్రవరి 29: మండల పరిధి విజలాపురంలో గురువారం టీడీపీ నాయకులు గ్రామవికాస సమావేశం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, నాయకులు ఆంజినేయరెడ్డి, విశ్వనాథ్, వెంకటాచలం మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలను పార్టీ నేతలు ఇంటింటా ప్రచారం చేయాలని, చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించాలని వారు కోరారుఈ సమావేశంలో నేతలు రామ్మూర్తి, శ్రీనివాసులురెడ్డి, మహ్మద్‌రఫీ, కుమార్, గుర్రప్ప, రవి, కృష్ణారెడ్డి, విశ్వనాథరెడ్డి, భువన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ద్రావిడ వర్సిటీ బంద్‌కు పిలుపు

గుడుపల్లె, ఫిబ్రవరి 29: ఏడు నెలలుగా జీతాలు చెల్లించనందుకు నిరసనగా ద్రావిడ వర్సిటీ తాత్కాలిక ఉద్యోగులు శుక్రవారం బంద్‌కు పిలుపునిచ్చారు. 15రోజులుగా తాము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నా వర్సిటీ పెద్దలు పట్టించుకోకపోవడంతో శుక్రవారం సంపూర్ణ బంద్ చేపడుతున్నామని వారు తెలిపారు. ఈ బంద్‌కు వర్సిటీ రెగ్యులర్ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు సహకరించాలని వారు కోరారు.

ఇంటింటా కరపత్రాల పంపిణీ

రామకుప్పం, ఫిబ్రవరి 29: రామకుప్పం మండలం బల్ల గ్రామంలో గురువారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేసి, ప్రచారం చేశారు. వైసీపీ పెద్దలకు హింసించడం తప్ప మరొకటి తెలియదన్నారు. వైసీపీ నేతలకు బుద్ధి వచ్చేలా కుప్పం ప్రజలు నారా చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నేతలు సర్దార్, మురుగేష్, ఎర్రప్ప, రఫీ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తా: గురజాల



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న గురజాల జగన్మోహన్, ముస్లిం మైనార్టీ నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 29: ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తానని టీడీపీ చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. గురువారం బీవీ రెడ్డి కాలనీలోని ఆయన నివాసంలో నగరంలోని ముస్లిం మైనార్టీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గురజాల మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీలందరూ తనకు సహకరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలుచేశారని చెప్పారు. కాగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పథకాలను రద్దుచేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిందని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని మసీదుల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం ముస్లిం మైనార్టీలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గౌస్‌బాషా, షరీఫ్, జాఫర్, అలీ, బాబు, అన్సర్ తదితరులు పాల్గొన్నారు.

జీజేఎంను కలిసిన గుడిపాల నాయకులు

గుడిపాల, ఫిబ్రవరి 29: మండలంలోని రామభద్రాపురం పంచాయతీ ముట్టుకూరుపల్లి గ్రామస్తులు గురువారం చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్‌ను కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హేమాద్రి నాయుడు, ఈశ్వర్ నాయుడు, వెంకటేశ్ యాదవ్, వరదరాజులు, ఏకాంబరం, రమేష్, సుబ్రహ్మణ్యం యాదవ్, సాంబశివ నాయుడు, శ్రీరాములు నాయుడు, చంద్రశేఖర్‌యాదవ్, పవన్ కుమార్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో పక్షపాత వైఖరి ఉండరాదు: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ జాషువా

చిత్తూరు, ఫిబ్రవరి 29: జిల్లాలో బదిలీ అయిన ఎస్‌ఐలు రానున్న సాధారణ ఎన్నికల్లో ఎలాంటి పక్షపాతం లేకుండా విధులు నిర్వహించాలని ఎస్పీ జాషువా ఆదేశించారు. గురువారం పోలీస్ అతిథి గృహంలోని కాన్ఫరెన్స్ హాలులో ఆయన మాట్లాడుతూ ఆరోపణలకు తావివ్వకుండా తటస్థంగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలన్నారు. పోలీసుశాఖపై గౌరవం పెరిగేలా ప్రజలతో వ్యవహరించాలని ఆయన సూచించారు. ఫిర్యాదుదారులు, బాధితులతో మర్యాదగా వ్యవహరించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమాజంలో అసాంఘిక శక్తులను అణచివేయడానికి చట్టాన్ని సమర్థవంతంగా వినియోగించాలన్నారు. మహిళలు, చిన్నపిల్లలు, బలహీన వర్గాల హక్కుల కోసం తగిన చట్టాలను వినియోగించాలన్నారు. పట్టణం, మండలాల్లో పరిస్థితులను అర్థం చేసుకుని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. శాంతి భద్రతలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా విధులు నిర్వహించి గౌరవాన్ని నిలుపుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ ఆరీఫుల్లా, ఎస్బీ సీఐ గంగిరెడ్డి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

భానుప్రకాష్‌ను అభినందించిన జనసేన నాయకులు



నగరి/విజయపురం, ఫిబ్రవరి 29: నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను గురువారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి స్వామినాథన్, నియోజకవర్గ కార్యకర్తలు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నగరి మండల సమన్వయ కర్త మెరుపుల మహేష్, నింద్ర మండల జనసేన అధ్యక్షుడు శివలింగం, పుత్తూరు, రూరల్ అధ్యక్షులు జగదీశ్వర్‌రాజు, వెంకటముని, నగరి, రూరల్ అధ్యక్షులు దేవ, ఉపేంద్ర, వడమాలపేట మండల అధ్యక్షుడు మునిశేఖర్‌యాదవ్, నాయకులు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ కుంభాభిషేక పూజలు



పూజల్లో పాల్గొన్న భూపేష్ గోపీనాథ్ తదితరులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 29: నగరంలోని బజారువీధి శివ షణ్ముగ సుందర వినాయక ఆలయ కుంభాభిషేక సప్తమి వార్షికోత్సవ పూజలు గురువారం వైభవంగా జరిగాయి. జిల్లా గాండ్ల తెలగ సంఘం అధ్యక్షులు ఆర్. భూపేష్ గోపీనాథ్ పాల్గొని పూజలు చేశారు. గోపూజ, విశ్వరూపదర్శనం, వేదార్చన, విఘ్నేశ్వరపూజ, 108 శంఖాల కలశపూజలు, గణపతి, శివగాయత్రి, శ్రీసూక్త, నవగ్రహ, విశేషద్రవ్య హోమాలు, అభిషేకాలు, విశేష అలంకారాలు, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ వి. కణ్ణన్, పుష్పారాజేంద్ర, అర్చకులు, వేద పండితులు, ఋత్వికులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. శుక్రవారం ఉదయం స్వామి అమ్మవార్లకు పుష్పపల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలకమండలి చైర్మన్ కణ్ణన్ తెలిపారు.

అధికారులు ఎన్నికల నియమావళిని పాటించాలి



ఈవీఎంలు పనిచేసే విధానాన్ని వివరిస్తున్న డీటీ విజయకృష్ణ

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 29: ఎన్నికల విధుల్లో పాల్గొనే కిందిస్థాయి సిబ్బంది నుంచి వివిధ స్థాయి అధికారుల వరకు ఎన్నికల కమిషన్ నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సిందేనని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ తెలిపారు. గంగాధరనెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని పీవోలు, ఏపీవోలు, సెక్టోరల్ అధికారులు, తహసీల్దార్లకు ఎన్నికల డీటీ విజయకృష్ణ ఈవీఎంల పని విధానం, ఎదురయ్యే సమస్యలు, పరిష్కరించుకోవాల్సిన విధానంపై వివరించారు. ఎన్నికల విధులు, బాధ్యతల గురించి అవగాహన కల్గించారు. తహసీల్దార్లు సుబ్బలక్ష్మమ్మ, సుభద్రమ్మ, పుష్పకుమారి, ఆల్‌ఫ్రెడ్, ఎఎస్‌వో ఆనందమోహన్ పాల్గొన్నారు.

పాలమునీశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పూజలు



కలశాలు తీసుకెళుతున్న దృశ్యం

నగరి, ఫిబ్రవరి 29: నగరి పట్టణ పరిధిలోని బస్టాండు సమీపంలో పాలమునీశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పూజలు వైభవంగా నిర్వహించారు. వేద పండితులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో గురువారం ఉదయం 8గంటలకు గణపతిపూజ, నవగ్రహశాంతి హోమం, కలశపూజ, యాగపూజలు నిర్వహించారు. చలువపందిళ్లు, విద్యుద్దీపాలంకరణలతో ఆలయ ప్రాంగణాన్ని దేదీప్యమానంగా సిద్ధం చేశారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకోవడానికే ప్రజాపోరు

గుడిపాల, ఫిబ్రవరి 29: ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే ప్రజాపోరు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మండల బీజేపీ అధ్యక్షుడు ధనుంజయ నాయుడు అన్నారు. గురువారం మండలంలోని కీలారిపల్లెలో ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం కేంద్ర పథకాలను అడ్డుపెట్టుకుని తామే చేసినట్లుగా ఆర్భాటాలు చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామినాథ్ గౌడ్, ఏలుమలై, సాయిచరణ్, రమా తదితరులు పాల్గొన్నారు.

కాణిపాక వరసిద్ధుడికి

వెండి అష్టలక్ష్మీ బిందె, పళ్లెం వితరణ



ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 29: స్వయంభు కాణిపాక వరసిద్ధుడికి తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన మల్లప్ప గురువారం వెండి బిందె, పళ్లెం విరాళంగా అందించారు. వెండి బిందె, పళ్లెం ఒక కిలో 800 వందల గ్రాముల బరువు కలిగి ఉన్నాయి. విరాళదాతను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో స్వామి దర్శనభాగ్యం కల్పించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలసిన ఏఎస్ మనోహర్



రామచంద్రయ్యతో మాట్లాడుతున్న ఏఎస్ మనోహర్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 29: మాజీ మంత్రి, మాజీ ఎంపీ ప్రస్తుత ఎమ్మెల్సీ కాపుకుల అగ్రనేత రామచంద్రయ్యను చిత్తూరు మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ గురువారం కడపలో మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం బలిజ సామాజిక వర్గంపై నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, భవిష్యత్ పరిణామాలపైన సుదీర్ఘంగా చర్చించినట్లు ఏఎస్ మనోహర్ తెలిపారు. సానుకూలంగా స్పందించిన రామచంద్రయ్య త్వరలోనే టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌లతో చర్చించి చిత్తూరు జిల్లాలోనే కాదు, రాయలసీమ జిల్లాల్లో తాజా రాజకీయ ప్రయోజనాల గురించి చర్చించి, బలిజ సామాజిక వర్గం రాజకీయ ప్రయోజనాలను కాపాడడానికి ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

సిమెంటు రోడ్లకు భూమిపూజ

నగరి, ఫిబ్రవరి 29: నగరి మండల పరిధిలోని వేలావడి, కావేటిపురం గ్రామాల్లో రూ.45 లక్షల వ్యయంతో నిర్మించబోయే సిమెంటు రోడ్లకు మంత్రి భర్త సెల్వమణి గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, నాయకులు బుజ్జిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతి



నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పాలసముద్రం, ఫిబ్రవరి 29: మండలంలోని పావులూరు కండ్రిగ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, మండల మాజీ టీడీపీ అధ్యక్షుడు చెంచు నాయుడు అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు, పార్టీ నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు కార్యదర్శి వాసు నాయుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, నాయకులు కంతం ప్రతాప్ నాయుడు, వాసు, ఉమాపతి, సాంబశివన్, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ఏపీ

హ్యూమన్‌రైట్స్ జ్యుడిషియల్ మెంబరు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 29: ఏపీ హ్యూమన్‌రైట్స్ జ్యుడిషియల్ మెంబరు సుబ్రహ్మణ్యం గురువారం స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వారిని ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆయనకు స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత చంద్రప్రకాష్‌కు పలువురి శుభాకాంక్షలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 29: జిల్లా టీడీపీ నేత చంద్రప్రకాష్ జన్మదినోత్సవం సందర్భంగా గురువారం పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. చిత్తూరు రూరల్ మండలంలోని బీఎన్‌ఆర్‌పేట క్రాస్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నేతలు బాణసంచా పేల్చి, కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. చిత్తూరు మండల టీడీపీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేశారు. వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి జయచంద్ర నాయుడు, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, మండల అధ్యక్షుడు శశికర్‌బాబు, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు మేషాక్, మండల ప్రధానకార్యదర్శి రము, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు దేవరాజులు నాయుడు, నాయకులు చల్లా, గురేష్, మనోహర్ నాయుడు, శ్యామ్, కంద, ప్రవీణ్, సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రికి అభినందనలు తెలిపిన కౌన్సిల్

నగరి, ఫిబ్రవరి 29: నగరి పట్టణ పరిధిలో పలు అభివృద్ధి పనులు మంత్రి రోజా సహకారంతో జరిగాయంటూ కౌన్సిల్ సభ్యులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. నగరి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ నీలమేఘం అధ్యక్షతన గురువారం ఉదయం 11గంటలకు జరిగింది. సమావేశపు అజెండాను చదివి వినిపించి, నగరిలో తాము చేసిన అభివృద్ధి పనులు, పన్నుల విషయమై చర్చించి సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్, వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, దయానిధి, టీడీ భాస్కర్, గోపాల్‌రెడ్డి ఇంద్రారెడ్డి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

కూలడానికి సిద్ధంగా ప్రవేశద్వారం దిమ్మె



కూలడానికి సిద్ధంగా ఉన్న సిమెంట్ దిమ్మె

కార్వేటినగరం, ఫిబ్రవరి 29: కార్వేటినగరం మండల కాంప్లెక్స్ ప్రవేశద్వారం వద్ద ఉన్న సిమెంట్ దిమ్మె కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. గుర్తు తెలియని వాహనం ఈ సిమెంట్ దిమ్మెను ఢీకొట్టింది. దీంతో సిమెంట్ దిమ్మె కింది భాగం పూర్తిగా కదలిపోయి ఎప్పుడైనా కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ప్రమాదకరంగా తయారైన ఈ సిమెంట్ దిమ్మె ఉన్న ప్రాంతంలో అధికారులు ఎలాంటి ముందస్తు హెచ్చరిక బోర్డులు పెట్టలేదు. ఇదే దారిలో వందల మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఒక వేళ దిమ్మె కూలితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దిమ్మెను కూల్చివేసి నూతన దిమ్మెను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


పూరిల్లు దగ్ధం



విజయపురం, ఫిబ్రవరి 29: మండలంలోని విజయపురం మిట్టూరులో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో అశోక్‌కు చెందిన పూరిల్లు గురువారం దగ్ధమై రూ.85 వేలు నష్టం వాటిల్లింది. వ్యవసాయ కూలీ పనుల నిమిత్తం వెళ్ళడంతో ఈ సంఘటన జరిగిందని బాధితుడు తెలిపారు. ఇంట్లో 4 గ్రాములు బంగారు కమ్మలు, గొలుసు, బట్టలు, బియ్యం, పప్పులు పూర్తిగా దగ్ధమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమ కుటుంబం వీధిన పడ్డామని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

తాడేపల్లిగూడెం సభను చూసి

సీఎం జగన్ గుండెల్లో వణుకు: టీడీపీ



మాట్లాడుతున్న దొరబాబు, సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 29: తాడేపల్లెగూడెంలో జరిగిన టీడీపీ, జనసేన సభను చూసి సీఎం జగన్ గుండెల్లో వణుకు పుట్టిందని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి సురేంద్ర కుమార్ చెప్పారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ వైసీపీ దొంగలు, గూండాలతో టీడీపీ, జనసేన శ్రేణులు నిత్యం పోరాడుతున్నాయని అన్నారు. టీడీపీ, జనసేన జతకట్టడం రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని పేర్కొన్నారు. మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న సీఎం జగన్ కూడా పులి వెందులలో ఓడిపోతారని జోస్యం చెప్పారు. అలాగే రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన విజయం సాధించడం ఖాయమని టీడీపీ చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్ర పర్యాటక శాఖకు 'లక్ష్మీమహల్' అప్పగింత



లక్ష్మీమహల్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం

కార్వేటినగరం, ఫిబ్రవరి 29: కార్వేటినగరం లక్ష్మీ మహల్ భవనాన్ని రాష్ట్ర పురావస్తు శాఖ నుంచి రాష్ట్ర పర్యాటక శాఖకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఈ నెల 28వ తేదీన జీవో నెంబర్ 7ను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ రజితభార్గవ పేరుమీద ఈ జీవో విడుదలైంది. రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో మానవ వనరుల కొరత, నిధుల కొరత వల్ల ఈ లక్ష్మీమహల్ భవనాన్ని నిర్వహించలేమని తెలుపుతూ రాష్ట్ర పర్యాటక శాఖకు జీవో నెంబర్ 7లో పేర్కొన్నారు. అయితే ఆ భవనం అభివృద్ధి కోసం ఆర్థిక శాఖ నుంచి నిధుల విడుదలపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడం గమనార్హం. ఎన్నికల షెడ్యూల్ వచ్చే ముందు ఈ ఉత్తుత్తి జీవో విడుదల వల్ల లక్ష్మీమహల్ భవనం అభివృద్ధికి ఒరిగేది ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి సొంత మండలంలో ఉన్న లక్ష్మీమహల్ భవనం గురించి ఆయన పట్టించుకోకపోవడం దారుణమని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రిగా రోజా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి నగరి నియోజకవర్గం పక్కనే ఉన్న కార్వేటినగరంలో పర్యాటకంగా అభివృద్ధి చేయదగిన ప్రాంతాల గురించి ఏ రోజూ పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. తిరుపతి పర్యాటకశాఖ అధికారులతో కలిసి గురువారం లక్ష్మీమహల్ భవనాన్ని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, తిరుపతి ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, రాపూరి లక్ష్మీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లత, స్థానిక సర్పంచ్ ధనంజయ వర్మ పాల్గొన్నారు.

లక్ష్మీమహల్‌కు పర్యాటక శోభ దక్కేనా?

లక్ష్మీమహల్ భవనాన్ని కార్వేటినగరం సంస్థానాధీశులు 1868-1972 సంవత్సరాల్లో నిర్మించారని చారిత్రక ఆధారాల వల్ల తెలుస్తోంది. లక్ష్మీమహల్ భవనం పైకప్పు, లోకప్పు పూర్తిగా దెబ్బతిన్నాయి. మహల్ భవనాన్ని పూర్తిగా రాజస్థానీ వాస్తు శైలిలో నిర్మించారు. ఈ భవనం పైకప్పు పూర్తిగా దెబ్బతిని పెచ్చులూడి కిందపడుతోంది. లక్ష్మీమహల్‌కు పర్యాటక శోభరావాలని స్థానికులు కోరుకుంటున్నారు.

టీడీపీలో చేరిన జగన్నాథపురం వైసీపీ సర్పంచ్



గాలి భానుప్రకాష్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్, అనుచరులు

విజయపురం, ఫిబ్రవరి 29: మండలంలోని జగన్నాథపురం వైసీపీ సర్పంచ్ రాణెమ్మ, ఆమె భర్త నారాయణరాజు, అనుచరులు నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో గురువారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో పార్టీ కండువా వేసుకొని తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా భాను మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను, దౌర్జన్యాలను చూసి వైసీపీ నుంచి పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారని చెప్పారు. గ్రామంలో మోడి నాగయ్య, వెంకటేసులు యాదవ్, కన్నయ్య, వెంకటేసులకు చెందిన కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, నాయకులు చెంచయ్య, చంద్రశేఖర్‌రాజు, గాలి మురళీ నాయుడు, గజేంద్ర నాయుడు పాల్గొన్నారు.

పరిశ్రమల రంగంలో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 29: పరిశ్రమల రంగంలో ప్రతి ఒక్కరూ రాణించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆట్లూరి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో డీఆర్‌డీఏ పీడీ తులసి అధ్యక్షతన పీఎం విశ్వకర్మ అంశంపై సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 రకాల పారిశ్రామిక రంగాల్లో ఆసక్తిగల వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పీఎం విశ్వకర్మ పథకం ద్వారా ప్రయోజనం పొంది, పరిశ్రమల రంగంలో రాణించాలన్నారు. పరిశ్రమ స్థాయిని కాకుండా తాము స్థాపించిన పరిశ్రమ ద్వారా ఎంత మందికి ప్రయోజనం చేకూర్చుతున్నామనే భావనతో చేపట్టాలన్నారు. ఇందుకు బ్యాంకులు, ప్రభుత్వం సంస్థలు ప్రోత్సాహం ఉంటుందని గుర్తు చేశారు. పరిశ్రమల శాఖ ఏడీ చంద్రశేఖర్, ఎల్‌డీఎం హరీష్, బీజేపీ నాయకులు రవికుమార్, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతో రాష్ట్రం సోకులు: బీజేపీ



ప్రజాపోరులో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మణివర్మ

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 29: కేంద్ర ప్రభుత్వ నిధులు విడుదల చేస్తున్నప్పటికీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం సోకులు చేస్తూ కేంద్రం చేసే సహాయాన్ని విస్మరించడం ఇంకెంతోకాలం సాగదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మణివర్మ, నియోజకవర్గ కన్వీనర్ రాజేంద్రన్, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గసభ్యుడు ఇడగట్టి సుధాకర్‌లు ధ్వజమెత్తారు. రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి గ్రామ గ్రామాన ప్రజలకు తెలియజేసేందుకు గురువారం మండల బీజేపీ నేతలు ప్రచారం చేశారు.వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని, రాష్ట్రంలో సైతం ప్రజలు బీజేపీకి ఒక్కసారి అధికారం కట్టబెట్టాలని విన్నవించారు. మండల బీజేపీ అధ్యక్షుడు మురళీ, నేతలు వేణుగోపాల ఆచ్చారి, అంజలి, సుందరరాజు, గుణశేఖర్‌రెడ్డి, ఆనంద్‌బాబు, నారాయణమూర్తి, గోవిందరెడ్డి, నటరాజ్, రంజిత్‌కుమార్, వాణిశ్రీ, శరవణకుమార్ పాల్గొన్నారు.

విద్యాబోధన నూతన ఆవిష్కరణలకు నాంది కావాలి

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 29: విద్యాబోధన నూతన ఆవిష్కరణలకు నాంది కావాలని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి పేర్కొన్నారు. 2020 జాతీయ నూతన విద్యా విధానంలోని సింగిల్ మేజర్ విధానంపై కళాశాలలో నిర్వహించే ఐదు రోజుల సదస్సును గురువారం ఆమె ప్రారంభించారు. ఒక సబ్జెక్టును మేజర్‌గా ఎంచుకుని దానిపై విద్యార్థులు పూర్తిస్థాయిలో అభ్యసించే విధంగా బోధించాలన్నారు. వీటితో పాటు మైనర్ సబ్జెక్టును సైతం ఎంపిక చేసుకునే అవకాశం విద్యార్థులకు కల్పించాలని సూచించారు. శాస్త్ర, సాంకేతిక, విద్యా రంగాల్లో నూతన ఒరవడులు సృష్టించడానికి మేజర్ సబ్జెక్టు బోధన ఎంతో ఉపకరిస్తోందన్నారు. సమావేశంలో కార్యక్రమ సమన్వయకర్త జయచంద్రుడు, చిత్తూరు, పీలేరు, నగరి, కళాశాలలకు చెందిన వృక్షశాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కరుణ్‌కుమార్

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 29: భారత రాజ్యాంగంలో పిల్లలకు కల్పించిన చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కరుణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో ఎంఈవో సెల్వరాజ్ అధ్యక్షతన 7, 8 తరగతి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరుణ్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలకు విద్య ప్రాథమిక హక్కుని తెలిపారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇటీవల నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో విజేతలైన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హోమియోపతి డాక్టర్ కన్నారెడ్డి కన్నుమూత

- నివాళులు అర్పించిన పలువురు టీడీపీ, వైసీపీ నేతలు



నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 29: మండలంలోని వరత్తూరు పంచాయతీ కుమ్మరపల్లె గ్రామానికి డాక్టర్ కన్నారెడ్డి తిరుపతిలో ఎన్నోఏళ్లుగా హోమియోపతి వైద్యసేవలు అందిస్తున్నారు. గత నెల రోజులుగా కన్నారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తిరుపతిలో కన్నుమూశారు. ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన కుమ్మరపల్లెకు తీసుకొచ్చిన సమాచారం తెలుసుకున్న పలువురు టీడీపీ, వైసీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ సోదరుడు టీడీపీ నేతలు ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, వి.ఎం.నిధి, శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, జ్యోతియాదవ్, గణేష్‌రెడ్డి, వెంకటేష్ నాయుడు, వైసీపీకి చెందిన వేపంజేరి ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, మణిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించి, మృతుడి కుటుంబసభ్యుల్ని పరామర్శించారు.

ఏసీ సేవలు మరువలేనివి: మేయర్



ఏసీని సన్మానిస్తున్న మేయర్, కమిషనర్

చిత్తూరు, ఫిబ్రవరి 29: నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ గోవర్ధన్ సేవలు మరువలేనివని మేయర్ అముద అన్నారు. గురువారం నగరపాలక కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో కమిషనర్ అరుణ మాట్లాడుతూ హెల్త్ అసిస్టెంట్‌గా, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా, సూపర్‌వైజర్‌గా, కమిషనర్‌గా విధులు నిర్వహించి అత్యుత్తమ సేవలందించారన్నారు. అనంతరం ఆయన్ను నగరపాలక కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డిలతో పాటు సిబ్బంది ఘనంగా సన్మానించారు.

షర్మిల బహిరంగసభను విజయవంతం చేయండి

పూతలపట్టు, ఫిబ్రవరి 29: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ నేత ప్రభాకర్ కోరారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం తిరుపతి ఎస్వీ స్టేడియంలో జరుగనున్న భారీ బహిరంగ సభకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం సభతో జగన్‌లో ప్రకంపనలు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 29: తాడేపల్లెగూడెంలో జరిగిన టీడీపీ, జనసేన సభను చూసి సీఎం జగన్‌లో ప్రకంపనలు మొదలయ్యాయని గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ గురువారం ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వైసీపీ నాయకులతో పోరాటం చేస్తున్న టీడీపీ, జనసేన శ్రేణులకు శత కోటి వందనాలని అన్నారు. ఏపీ భవిష్యత్తు కోసమే టీడీపీ, జనసేన పార్టీలు జతకట్టాయని, సొంత ప్రయోజనాల కోసం కాదనే విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన కోరారు.